www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 3 జనవరి 2023





భీమవరంలో జరుగుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి హాజరైన ప్రతినిధులు

త్వరలోనే కీలక స్మగ్లర్ల అరెస్టు

- అదుపులో అంతర్రాష్ట్ర స్మగ్లర్ మురగన్
- రెండు వాహనాలు సహా 18 దుంగలు సీజ్
- మీడియాతో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ చక్రవర్తి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ ప్రాంతం నుండి ఎర్రచందనంను అక్రమంగా తరలిస్తూ జల్సాలు చేస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్ మురగన్‌ను అదుపులోకి తీసుకున్నామని, త్వరలోనే కీలక స్మగ్లర్‌ను అరెస్టు చేస్తామని టాస్క్‌ఫోర్స్ ఎస్పి చక్రవర్తి వెల్లడించారు. తమిళనాడు తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్‌కు చెందిన మురగన్ జల్సాలకు అలవాటుపడి ఎర్రచందనాన్ని ఎగుమతులు చేస్తూ కోట్లు సంపాదించేవాడని తెలిపారు. మురగన్ అరెస్ట్‌కు సంబంధించి సోమవారం తిరుపతి నగరపరిధిలోని కపిలతీర్థం వద్దగల టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఎస్పీ చక్రవర్తి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సాదారణ తనిఖీల్లో భాగంగా జనవరి 1వ తేదీన కరకంబాడీ ఫారెస్ట్ బీట్ పరిధిలోని రేణిగుంట-శ్రీకాళహస్తి ప్రధాన మార్గంలో ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా శ్రీకాళహస్తి మార్గం నుండి వస్తున్న తెలుపురంగు స్విఫ్ట్ కారు(టిఎన్07సిబి3724), ఈచర్ మినీలారి (టిఎన్31ఏఏ3991) గల వాహనాలు టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీలను గమనించి వాహనాలను ఆపి పారిపోవడానికి ప్రయత్నించగా టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ పి.నరేష్ తన సిబ్బందితో వెంటబడి మురగన్‌న్, రేణిగుంట రోడ్డు టిఎన్‌పాల్యం పద్మావతినగర్‌కు చెందిన ఎస్‌కె మేఘవర్ణం అలియాస్ మేఘనాథంను అదుపులోకి తీసుకున్నామన్నారు. మురగన్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో ఆరు కేసులు, సత్యవేడు పిఎస్ పరిధిలో ఒక కేసు నమోదు అయినట్లు ఎస్పీ తెలిపారు. దీంతో ఎర్రచందనం అక్రమరవాణాలో చాలా కాలంగా పోలీసులను, అటవీశాఖ అధికారులను కలవరపెట్టిన అంతర్రాష్ట్ర స్మగ్లర్ మురగన్‌ను టాస్క్‌ఫోర్స్ అరెస్ట్ చేయగలిగిందన్నారు. 'పుష్ప' చిత్రంలో సైతం మురగన్ పేరుతో ఒక క్యారెక్టర్‌ను చిత్రీకరించారు. ఆ మురగన్‌నే టాస్క్‌ఫోర్స్ చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వైకుంఠ ఏకాదశికి..

భక్తుల్లేక బోసిపోయిన తిరుమల

హడావిడి నిర్ణయాలతో అగమ్యగోచరం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల తొలిసారిగా న్యూఇయర్, వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో బోసిపోయింది. తిరుమల తిరుపతి దేవస్థానం గంటకో నిబంధన విధించడమే కారణమని తెలుస్తోంది. ప్రతి ఏటా న్యూ ఇయర్, వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో రోజుకు లక్షపైనే భక్తులు స్వామివారిని దర్శించుకునేవారు. అయితే న్యూ ఇయర్ రోజు 53వేల మంది మాత్రమే భక్తులు దర్శించుకోవడం గమనార్హం. న్యూ ఇయర్ రోజు తిరుమల బోసిపోయి కనిపించడంతో సోమవారం సాయంత్రం 15వేల మంది భక్తులకు హడావిడిగా టికెట్లు ఇచ్చి దర్శనానికి తరలించారు. ఈ నిర్ణయంతో టోకెన్లు 6, 7 తేదీల్లో పొందినవారు విస్తుపోయారు. ఆర్భాటపు ప్రకటనలు చేయడం తిరిగి సవరించుకోవడం టిటిడికి పరిపాటిగా మారింది. ఎంతో ప్రతిష్ఠత్మకంగా నిర్వహించాల్సి నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి వెల...వెల పోయింది.

తిరుమల కొండపై దర్శనం కోసం వచ్చే భక్తులే కరువయ్యారు. ఒక వైపు టిటిడి 5లక్షల టోకెన్లను ఇచ్చేసి నిలిపేస్తామని...టోకెన్ కల్గిన భక్తులకు మాత్రమే దర్శనమని...ఆర్.టి.సి దర్శన టికెట్లు కల్గిన వారినే బస్సులో ఎక్కనిస్తామని ప్రకటనలు చేశారు. దీంతో ఏకాదశినాడు ఎందుకు తిరుమలకు వెళ్లి ఇబ్బందులు పాలవ్వడమని భక్తులు వెనక్కి తగ్గారు. దీంతో తిరుమల మొత్తం ఖాళీగా మారింది. ఈ ఖాళీని పూరించడం కోసం వెంటనే హడావిడిగా నిర్ణయం తీసేసుకున్నారు. 15వేల మందికి దర్శన టికెట్లు ఏకాదశికే ఇస్తున్నామని చెప్పి కౌంటర్ల వద్దకు భక్తులు చేరుకోవాలని చెప్పారు. అప్పటికే టికెట్లు పొందిన భక్తులు ఆవేదన చెందారు. ఎటు చూసినా పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది పహారా ఏర్పాటు చేశారు. పరిమితంగా టికెట్లు ఇచ్చినప్పుడు ఎందుకు వీరంతా అని స్థానికులు, టిటిడి ఉద్యోగులు ముక్కున వేలేసుకున్నారు. జనవరి 1 అంటే శ్రీవారి దర్శనం చేసుకుంటే ఆ సంవత్సరం మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఇలాంటి ప్రత్యేక రోజుల్లో ఏర్పాట్లను ప్రత్యక్షంగా ఉన్నతాధికారులు పరిశీలించి నిర్ణయాలు తీసుకుని సామాన్య భక్తులు వచ్చేలా చర్యలు చేపట్టేవారు. అయితే ఈ పర్యాయం ఈఓ ధర్మారెడ్డి లేక పోవడం తో అధికారులలో సమన్వయం కొరవడింది. ఎవరికి వారు నిర్ణయాలు తీసుకున్నారు. గంటలో ప్రకటించి దర్శనానికి రండి అంటే ఎలా ఉంటుంది అని భక్తులు ప్రశ్నించారు.ఉద్యోగులు నుండి తీవ్ర వ్యతిరేకత వచ్చింది.



మరోవైపు తిరుపతి దేవస్థానం వైకుంఠ ఏకాదశికి విఐపిల సేవలో తరించింది. తెల్లవారుజామున 1.30 గంటల నుంచి దాదాపు నాలుగున్నర గంటల పాటు 'పెద్దల' సేవలో తరించిన టిటిడి, సామాన్యులకు ఉదయం 6 గంటలకు అవకాశం కల్పించింది.

శ్రీ వారిని దర్శించుకున్న ప్రముఖులు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి రాజశేఖర్, తెలంగాణ హై కోర్టు జస్టిస్ నంద, ఏపీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి వెంకట నాగేశ్వర రావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, అంబటి రాంబాబు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మంత్రి పుష్ప శ్రీవాణీ, కర్ణాటక గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్, మేరుగ నాగార్జున, తెలంగాణ మంత్రి మల్లారెడ్డి, మంత్రి శ్రీనివాస గౌడ్, రాష్ట్ర మంత్రి విశ్వరూప్, పార్లమెంటు సభ్యుడు అర్.కష్ణయ్య, కొల్లు రవీంద్ర ఇతర ప్రముఖులు వున్నారు. వీరికి ఆలయ రంగనాయక మండపంలో శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్థానిక ఆలయాల్లో ... టిటిడి స్థానిక ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు విశేషంగా దర్శించుకున్నారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఉదయం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా



నిర్వహించారు. శ్రీనివాస మంగాపురం కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస కైంకర్యాల అనంతరం వేకువజామున వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభమయ్యింది. అప్పలాయగుంటలో భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. సాయంత్రం 5-6 గంటల మధ్య తిరువీధి ఉత్సవం జరిగింది. అదేవిధంగా నారాయణవనంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, నాగలాపురం వేద నారాయణస్వామివారి ఆలయం, తిరుపతిలోనిగోవిందరాజస్వామివారి ఆలయం, కోదండరామాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

తిరుచానూరులో...: రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏవిఎస్వో శైలేంద్రబాబు, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, తిరుపతి ఈస్ట్ డిఎస్పి మురళీకష్ణ, తిరుచానూరు సిఐ సుబ్రహ్మణ్యం రెడ్డి, విఐ రామ్మోహన్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు దామోదర్, అశోక్, ఆలయ అర్చకులు బాబుస్వామి ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా స్వర్ణరథోత్సవం

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం స్వర్ణరథోత్సవం వేడుకగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు రథాన్ని అధిరోహించి నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన స్వర్ణరథాన్ని టిటిడి మహిళా ఉద్యోగులతో పాటు పలువురు మహిళలు గోవిందనామస్మరణతో భక్తిశ్రద్ధలతో లాగారు. స్వర్ణరథోత్సవాన్ని గ్యాలరీల్లో వేచి ఉన్న భక్తులు దర్శించుకున్నారు. టిటిడి బోర్డు సభ్యులు మల్లీశ్వరి, మధుసూదన్ యాదవ్, నరసింహ కిషోర్, చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ స్పాట్‌లో సస్పెండ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం 33వ డివిజన్ కొర్లగుంట మెయిన్ రోడ్డు లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శనీయమన్నారు. అందుకే నిత్యం ప్రజల మధ్యనే ఉంటున్నామని తెలిపారు. కొర్లగుంట మెయిన్ రోడ్‌లో గడపగడప కార్యక్రమంలో మహిళలు గత ఆరు నెలల నుండి చక్కెర, కందిపప్పు ఇవ్వడం లేదని, బియ్యం మాత్రమే ఇస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే రేషన్ డీలర్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని చరవాణి ద్వారా ఏ.ఎస్.ఓను ఆదేశించారు. అక్కడున్న మహిళలు ఎమ్మెల్యేకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లు కుమారి, రామస్వామి వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, శివకుమార్, శేఖర్ పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా ...

పి. ఉదయ్ కుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ గా .పి. ఉదయ్ కుమార్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1986 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వేస్ సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందినవారు. అదనపు జనరల్ మేనేజర్‌గా విధులు చేపట్టేముందు చెన్నయ్‌లోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించేవారు. 1983 లో జమాల్ పూర్ లో స్పెషల్ క్లాస్ రైల్వే అప్రెంటీస్ గా ఇండియన్ రైల్వేస్ లో ఉద్యోగంలో చేరారు .

దళితులకు శ్మశానాల ఏర్పాటు అభినందనీయం




ప్రజాశక్తి -తిరుపతి సిటీ

దళితులకు స్మశానాల ఏర్పాటు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడమే కాకుండా, కాలపరిమితి విధించడం అభినందనీయమని వక్తలు అభిప్రాయపడ్డేరు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాఖ మంత్రులు డాక్టర్ మెరుగు నాగార్జున తిరుపతి విచ్చేసిన సందర్భంగా సోమవారం దళిత నాయకులతో స్థానిక కేశవరెడ్డి స్కూల్ వద్ద దళిత నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ అధ్యక్షత వహించారు. రాజధాని లో 127 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించడం దళితుల ఆత్మగౌరవానికి చిహ్నంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు మల్లారపు మధు, హరి చౌహాన్ నాయక్, ఎన్. రాజేష్, కుసుమ కుమారి, సర్పంచు రంగయ్య పాల్గొన్నారు.

ఫ్లెక్సీల్లేని పంచాయతీగా తీర్మానం

ప్రజాశక్తి -తిరుపతి(మంగళం):



గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని తీర్మాణం చేశామని మంగళం పరిధిలోని తిరుమలనగర్ గ్రామ పంచాయతీ వైసీపీ ఇన్‌చార్జి గుండ్రాజు శివశంకర్‌రాజు తెలిపారు. సోమవారం గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహించామని, సర్పంచ్ వకుళకు కోళ్ళఫారంలో సీసీ రోడ్డు నిర్మాణానికి, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ప్రజలు వినతులు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులకు భూసేకరణ త్వరితగతిన చేపట్టాలి

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పిఎస్ ప్రద్యుమ్న

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రహదారుల ప్రాధాన్యతను గుర్తించి, భూ సేకరణ విషయంలో ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చూడాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.ఎస్.ప్రద్యుమ్న సూచించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జాతీయ, రాష్ట్ర రహదారుల అధికారులతో, సంబందిత ఇంజనీర్లతో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి, జె.సి. డి.కె బాలాజి లతో కలసి సమీక్ష నిర్వహిచారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ రహదారుల ప్రాధాన్యతను అధికారులు గుర్తించాలని, అలాగే భూ సేకరణ రైతులతో సమన్వయం చేసుకొని వారిని ఒప్పించి చేయగలిగితే మంచిదని, గతంలో ఈ జిల్లాలో భూ సేకరణ సమయంలో తన అనుభవం పై చెబుతున్నానని అన్నారు. 'అధికారులుగా మనం రహదారుల భూ సేకరణలో పది కాలాల పాటు గుర్తుండేలా మనమున్న సమయంలో ఇవి ఏర్పడ్డాయని వాటిని చూసినప్పుడు మనకు సంతోషం కలుగుతుంది' అని అన్నారు. పీలేరు-కాలూరు, రేణిగుంట- నాయుడు పేట, కష్ణపట్నం పోర్ట్ 2,3,4 సంబంధించిన భూ సేకరణ ఈ సంక్రాంతి లోపు పూర్తి చేయాలని అన్నారు. కరకంబాడి వద్ద భూ సేకరణ, దాదాపు రెండు వందల స్ట్రక్చర్లకు సంబంధించి ఎస్టిమేషన్స్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో కంప్యూటర్ హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రాక్ ఏర్పాటు కోసం ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని, 2016 నుండి 2019 వరకు ఆర్.టి.సి లో పెండింగ్ లో ఉన్న కాంపాసినేట్ ఉద్యోగాల నియామకం చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమీక్షలో డి.ఆర్.ఓ శ్రీనివాస రావు, జిల్లా రవాణా శాఖాధికారి సీతారామి రెడ్డి, ఎన్.హెచ్.ఏ.ఐ, పి.ఓ హరికష్ణ, ఆర్.డి.ఓ లు జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి, కనకనరసారెడ్డి, రామారావు, కిరణ్ కుమార్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ శ్రీనివాసులు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:

తిరుచానూరు శిల్పారామంలో 'రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన 2023 మేళా'ను రాష్ట్ర సిఇఒ, శిల్పారామం శ్యామ్ సుందర్ రెడ్డితో కలిసి కలెక్టరు కె.వెంకట రమణా రెడ్డి ప్రారంభించారు. సోమవారం ఉదయం స్థానిక శిల్పారామం లో భారత ప్రభుత్వ జౌళి శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ జిల్లాల, రాష్ట్రాల చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు ఇక్కడ ప్రదర్శనలో అమ్మకం ద్వారా వారికి జీవనోపాధి కల్పించటంతో పాటు, వివిధ రాష్ట్రాల కళాకారుల ఉత్పత్తులు మన తిరుపతిలోనే దొరికేలా సంక్రాంతి పండుగ సందర్భంగా చేనేత ఉత్పత్తులు కొనుగోలు ద్వారా నగర ప్రజలు చేనేత కళాకారులను ప్రోత్సహించాలన్నారు. జనవరి 15 వరకు 14 రోజుల పాటు ఈ అమ్మకాలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చేనేత వస్త్ర కళాకారులకు తమ ఉత్పత్తులను మధ్యవర్తుల ద్వారా కాకుండా నేరుగా అమ్ముకొనుటకు ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయోగ పడుతుందని, కరోనా నుండి ఇబ్బంది పడిన ఈ కళాకారులకు తోడ్పాటు అందించినట్లు అవుతుందన్నారు. ఇందులో 80 మంది కళాకారులు వివిధ రాష్ట్రాల నుండి ఉత్తరప్రదేశ్, వెస్ట్ బెంగాల్, మధ్యప్రదేశ్, బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జమ్ము కాశ్మీర్ తదితర ప్రాంతాల నుండి వారి ఉత్పత్తులు ప్రదర్శించి అమ్ముతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత అభివద్ధి వీవర్స్ సొసైటీ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ సాహు ప్రత్యేక ఆహ్వానితులుగా, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపెందర్ రెడ్డి, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, పరిపాలన అధికారి ఖాదర్ వలీ పాల్గొన్నారు.



వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్

తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకన్న

ఆలయానికి పోటెత్తిన భక్తజనం

- 70 వేల మందికి పైగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్న భక్తులు
- తుమ్మలగుంటకు ప్రముఖుల తాకిడి
- భక్తులను ఆకట్టుకున్న పుష్పాలంకరణలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తుమ్మలగుంట శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు సోమవారం వేకువజామున 2.30 గంటలకే భక్తులు క్యూలైన్లకు చేరుకున్నారు. ఉదయం 4 గంటలకు ఆలయ నిర్వాహకులు భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. దాదాపు 70 వేలకు పైగా భక్తులు శ్రీవారిని దర్శించుకుని ఉత్తర ద్వార ప్రవేశం చేశారు. ఆలయ పరిసరాలు గోవింద నామ స్మరణలతో మారుమ్రోగాయి. వైకుంఠ ఏకాదశిని ఆలయంలో, వెలుపల చేపట్టిన పుష్పాలంకరణలు భక్తులను కట్టిపడేశాయి. వివిధ రకాల పుష్పాలతో రూపొందించిన అలంకరణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయం ముందు భాగంలో గరుడ వాహనంపై కొలువు దీరిన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ప్రత్యేక ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. స్వామి, అమ్మవార్లను దర్శించిన భక్తులు తన్మయత్వం చెందారు. ఉదయం నుంచి రాత్రి వరకు క్యూలైన్లు భారీ జన సందోహంతో కిటకిటలాడాయి. ఆలయ ధర్మకర్త, ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలతో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. రాత్రి 11.30 గంటల వరకు భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి పద్మావతి వర్సిటీలో యువజనోత్సవాలు

ప్రజాశక్తి - క్యాంపస్ :

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 36వ అంతర్ విశ్వవిద్యాలయాల దక్షిణ ప్రాంత యువజనోత్సవాలను జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సావేరి అతిథి గహ సమావేశపు మందిరంలో సోమవారం ఉదయం పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 36వ అంతర్ విశ్వవిద్యాలయాల దక్షిణ ప్రాంత యూత్ యువజన ఉత్సవాలకు మొత్తం దాదాపుగా 1500 మంది హాజరవుతారని.. ప్రస్తుతం 700 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. ఈ దక్షిణ ప్రాంత యువజన ఉత్సవాలను శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పద్మ తరంగ్ అనే పేరుతో పిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ న్యూఢిల్లీ వారి సంయుక్త ఆధ్వర్యంలో మహిళా వర్సిటీలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలలో సంగీతం, నత్యం, థియేటర్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్, లిటరరీ, థియేటర్ ఈవెంట్స్, కల్చరల్ ప్రోగ్రామ్స్ వంటి అంశాలలో 28 ప్రత్యేక విభాగాలలో పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం దగ్గర నిర్వహించడం జరుగుతుందన్నారు. దక్షిణ ప్రాంత విశ్వవిద్యాలయాలు దాదాపు 18 విశ్వ విద్యాలయాలు ఈ పోటీలలో పాల్గొంటారని వెల్లడించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి 45 మంది కళాకారులు పాల్గొంటారని వివరించారు. సాయంత్రం మూడున్నర గంటలకి కళాకారులచే నగరంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర టూరిజం, యువజన, సాంస్కృతిక కళల శాఖామంత్రి ఆర్కే రోజా హాజరవుతున్నారన్నారు. గెస్ట్ ఆఫ్ హానర్ గా తిరుపతి ఎంపీ మధ్యలో గురుమూర్తి, ఏఐయు జాయింట్ సెక్రటరీ బల్జిత్ సింగ్ సేహాయ్, శ్రీ సిటీ ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ సన్నారెడ్డి రవీంద్ర, గాయని శైలజ హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సోషల్ సైన్స్ డీన్ ఆచార్య కె.అనురాధ, కోఆర్డినేటర్లు ఆచార్య టి. త్రిపుర సుందరి, ఆచార్య శైలేశ్వరి, పిఆర్వో శ్రీరజిని తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 97 అర్జీలు

తిరుపతి టౌన్ :



'స్పందన' కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాల వ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీనివాసరావు, ఏఓ జయరాంతో కలసి అర్జీలను స్వీకరించారు. మొత్తం 97 అర్జీలు అందాయి.

సత్వరమే స్పందించాలి : మేయర్ శిరీష

'స్పందన' ఫిర్యాదులను పెండింగులో పెట్టకుండా సత్వరమే పరిష్కరించేలా పనిచేయాలని అధికారులను ఉద్దేశించి తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఎంఈ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు లోకేష్ వర్మ, సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

5న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ- 2023 ప్రక్రియ గత సంవత్సరం ఆగస్ట్ 4 నుండి ప్రారంభమైందని, ఎన్నికల ఆదేశాల మేరకు ఈ నెల 5 న సవరించిన పూర్తి జాబితా ప్రకటించాల్సి ఉంటుందని తిరుపతి జిల్లా ఎలక్టరోల్ అబ్జర్వర్, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.ఎస్.ప్రద్యుమ్న సూచించారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ - 2023 పై నియోజక వర్గాల ఈ.ఆర్.ఓ లతో తిరుపతి జిల్లా ఎలక్టరోల్ అబ్జర్వర్, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి తో కలసి సమీక్ష నిర్వహించారు. అబ్జర్వర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ సమయంలో తొలగింపుల కోసం తప్పని సరి ఫారం-7 ఉపయోగించాలని, నిర్దేశించిన సమయం తర్వాత అందిన నమోదు, తొలగింపు దరఖాస్తులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి సిద్ధం గా ఉంచుకోవాల్సి ఉంటుందని, ఆపై ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ముందుకెళ్లాలని సూచించారు. ఓటర్ల జాబితాకు ఆధార్ అనుసంధానం పై ప్రత్యేక దష్టి పెట్టాలని అన్నారు. ఈ సమీక్షలో జె.సి డి.కె బాలాజీ, డి.ఆర్.ఓ శ్రీనివాస రావు, ఆర్.డి.ఓ లు కనకనరసారెడ్డి, రామారావు, కిరణ్ కుమార్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీ బర్దన్ వర్ధంతి



తిరుపతి సిటీ : సీపీఐ మాజీ కార్యదర్శి ఎబి బర్దన్ వర్ధంతి తిరుపతి సిపిఐ కార్యాలయంలో ఘనంగా జరిగింది. తొలుత బర్దన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో భాగమైన సెల్హాట్‌లో సెప్టెంబర్ 25, 1925న హేమేంద్ర కుమార్, సరళాదేవిలకు జన్మించిన బర్దన్, 15 ఏళ్ల వయస్సులో నాగ్‌పూర్‌లో ఉండగా కమ్యూనిస్టు పార్టీలో చేరారన్నారు. నాగ్‌పూర్‌లోని విద్యుత్, రైల్వే, వస్త్ర, రక్షణ రంగ పరి శ్రమల్లోని కార్మికులను ఉద్యమంలోకి సమీకరించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు బర్ధన్‌ను అరెస్టు చేసి రెండున్న రేళ్ల జైలులో ఉంచారు. అంతకు ముందు ఆయన రహస్య జీవితాన్ని గడి పారు. అటువంటి నాయకుడు కమ్యూనిస్టు పార్టీకి దూరమవ్వడం తీరనిలోటని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ ప్రభాకర్, బాలకష్ణ పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు.. వివిఎస్ఆర్ పాఠశాల విద్యార్థిని ఎంపిక




ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు రెండవ పట్టణ పరిధిలోని వివిఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని దీప్తి నెల్లూరులో జరిగిన 66వ పాఠశాల జిల్లా జట్ల ఎంపికలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికైంది. ఎస్ ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణం రాజు సోమవారం విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణంరాజు మాట్లాడుతూ అండర్ -17 విభాగంలో కబడ్డీ పోటీలో తమ పాఠశాల విద్యార్థిని ఎంపికైనందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. తమ పాఠశాలలో విద్య మాత్రమే కాకుండా విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలిగించడం కోసం ప్రతిరోజు ఆటలు ఆడిస్తామని, విద్యార్థులు ఉల్లాసంగా ఉండేందుకు చదువులో ఏకాగ్రత సాధించేందుకు ఆటలు బాగా సహకరిస్తాయన్నారు. అనంతరం పాఠశాల ప్రతినిధి బృందం విద్యార్థినిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లి చంద్రకళ, ప్రధానోపాధ్యాయులు శాంత కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు మనోహర్ పాల్గొన్నారు.

'ఎన్నికలకు ముందే ఓటమి భయం'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అధికార వైసీపీ నాయకులకు ఎన్నికలకు ముందే ఓటమి భయం పట్టుకుందనీ, అందుకే ఆరో వార్డులోని టిడిపికి చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లను అక్కసుతో చింపేశారంటూ పట్టణ టిడిపి బీసీ విభాగం నాయకులు విమర్శించారు. టీడీపీ ఫ్లెక్సీలు, బ్యానర్లు చింపి వేయడంపై అపాటి నాయకులు సోమవారం నిరసన తెలిపారు. బొజ్జల సుధీర్ రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు ఈ అనైతిక చర్యకు ఒడిగట్టారని మండిపడ్డారు. పోలీసులు వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దశరథ ఆచారి, కాసరం రమేష్, మిన్నల్ రవి, తీర్థం వెంకటేశ్వర్లు, ఉమేష్ రావు, మునిరాజ యాదవ్, వజ్రం కిషోర్, గుర్రప్ప శెట్టి, ఖాదర్ బాషా, జిలాని బాషా,నారాయణ, ఢిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో పలువురు ప్రముఖులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం పలువురు ప్రముఖులు విచ్చేశారు. పొన్నూరు ఎమ్మెల్యే వెంకటరోశయ్య, రాప్తాడు ఎమ్మెల్యేప్రకాష్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వార్త ఎండి గిరీష్ కుమార్ సంఘీ ముక్కంటిని దర్శించిన వారిలో ఉన్నారు. వీరికి ఆలయ పాలకమండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రాహు-కేతు పూజలు చేసుకుని స్వామీ అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా అంజూరు శ్రీనివాసులు ముక్కంటి జ్ఞాపికలు తీర్థప్రసాదాలు అందజేశారు.

సాయి గీతకు ఉత్తమ మహిళా ఉపాధ్యాయ పురస్కారం



పురస్కారాలు అందుకుంటున్న సాయిగీత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉత్తం మహిళా ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం నరసింహులు, టిటిడి దేవస్థానం విద్యాధికారి ఎం.భాస్కర్ రెడ్డి, విశ్రాంత డీన్ ఆచార్య బి.కృష్ణారెడ్డి, స్విమ్స్ కార్డియాలజిస్ట్ వి.వనజ, పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ కే.మహదేవమ్మ, పుత్తూరు డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు మన్యం నరసింహులు, వ్యవస్థాపకుడు భాస్కర్ వడియంలు విచ్చేశారు. నారాయణపురం మండలం కసిమిట్ట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న సాయిగీతకు ఉత్తమ మహిళా ఉపాధ్యాయ పురస్కారం అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న సాయి గీతకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు ట్యాబులు పంపిణీ



ప్రజాశక్తి - దొరవారి సత్రం: మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా అమలు చేసిన ఎనిమిదో తరగతి చదు వుతున్న విద్యార్థులకు ట్యాబులు అందించే కార్యక్రమంలో భాగంగా సోమవారం గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 71 మంది విద్యార్థులకు బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపాలయ్య చేతుల మీదగా ట్యాబులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉన్నతమైన విద్యను అందించాలన్న ఉద్దేశమే మన రాష్ట్రం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలు అందుకే రాష్ట్రంలో విద్యకు పెద్ద పీట వేసి విద్యార్థులు బాగా చదువుకునే విధంగా పలు పథకాలు అమలు చేస్తూ అందిస్తున్నారు. అందులో భాగంగానే ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబులు అందించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి బాగా చదువుకొని మంచి స్థాయికి ఎదిగి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన విద్యార్థులను దీవించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమమే వైసీపీ లక్ష్యం

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆదిమూలం



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి- పిచ్చాటూరు: వయోవృద్ధుల సంక్షేమమే వైసీపీ ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండల కేంద్రమైన పిచ్చాటూరు ఎంపిడిఒ కార్యాలయం సభ ప్రాగణంలో సోమవారం ఎంపిపి రేఖా ఆధ్వర్యంలో ఎంపిడివో శ్రీనివాసులు అధ్యక్షతన అవ్వతాతలకు పెంచిన సామజిక పింఛను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీలకు 102 నూతన పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. వాలంటీర్ల ద్వారా స్థానిక నాయకులు పంపిణీ చేయాలన్నారు. అవ్వాతాతలు సహా సామాజిక పింఛన్ రూ.2,750కి పెంపుపై లబ్ధిదారులు ఆనందభరితుల య్యారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే వారి ఇళ్ల వద్ద సందడి నెలకొంది. పెరిగిన పింఛన్‌పై వివిధ రూపాల్లో తమ సంతోషాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేశారు. పలు చోట్ల వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకాలు చేశారు. పండుగ వాతావరణంలో కొనసాగిందన్నారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక చిన్న కష్టం కూడా తెలియకుండా, ప్రతి నెలా వాలంటీర్లు తమ ఇంటి వద్దకే వచ్చి.. పింఛన్లు పంపిణీ చేస్తున్న తీరు పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని లబ్ధిదారులు కొనియాడారు.

పింఛన్ పంపిణీలో గందరగోళం

మండల కేంద్రమైన పిచ్చాటూరు ఎంపిడివో నూతన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో కారూరు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌కు, స్థానిక నాయకులకు వాగ్వివాదం జరిగింది. స్థానిక నాయకులకు తెలియకుండా వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయడం పట్ల సర్పంచ్, ఎంపిటిసి, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌ను నిలదీశారు. ఎంపిడివో శ్రీనివాసులు కలగజేసుకొని స్థానిక నాయకులతో నూతన పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని నాయకులు తెలియజేశారు. ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ మధుసూదన్ రావు, ఎంపీపీ రేఖ, జెడ్పిటిసి విష్ణు ప్రియ, మండల కన్వీనర్ హరిచంద్ర రెడ్డి, జెడ్పిటిసి ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్ కుమార్, నారాయణ ఎంపీపీ దివాకర్ రెడ్డి, ఎంపీటీసీలు రమేష్ రాజు, వేలు, బేబీ, సర్పంచులు కేజీ రోస్ రెడ్డి, మోహన్, పద్మనాభం, గజేంద్ర, పార్టీ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తులకు రక్షణేది..



ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంటలోని పంచాయతీ ఆస్తులకు రక్షణ ఏది అని సిపిఎం సీనియర్ నాయకులు ఓ.వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విఆర్ఆర్ రావన్, సర్పంచ్‌లు అలాగే పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. సోమవారం రేణిగుంట పట్టణంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేణిగుంట గ్రామపంచాయతీ స్థలాలను కబ్జా చేస్తున్నారని వాటి గురించి ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. పంచాయతీ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో వాటిని రక్షించాల్సిన బాధ్యత అధికారులదేనని తెలిపారు. అలాగే రేణిగుంటలో పందుల సమస్య ఎక్కువగా ఉందని అలాగే కుక్కలు కూడా ఎక్కువ ఉన్నాయని వాటి గురించి ఏమి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. గత గ్రామ సభలో కూడా వాటి గురించి ప్రశ్నించగా తాము చర్యలు తీసుకుంటామని చెప్పి ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. అలాగే ఇక ఇంటి స్థలాల విషయానికొస్తే ఎక్కడో పాగాలీలో స్థలాలు చూపిం చారన్నారు. ఇంతవరకు వాటి గురించి ఏమైందని పేదల ఇంటి కలగానే ఉందన్నారు. కాబట్టి పేదలకు ఇంటి స్థలాలు రేణిగుంట మండలంలోని చుట్టుపక్కల ఎక్కడైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాజేశ్వరి, సిఐటియు నాయకులు నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏకాదశికి ఆలయ పునఃనిర్మాణం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వచ్చే ముక్కోటి ఏకాదశి నాటికి శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ దేవాలయమైన ప్రసన్న వరదరాజుల స్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు పూర్తి చేస్తామని పాలకమండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు స్పష్టం చేశారు. వైకుంఠ ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్థానిక ప్రసన్న వరదరాజులస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ప్రసాదాలు వితరణ చేశారు. ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం మూలంగా భక్తులకు మూలవిరాట్ దర్శనం కల్పించలేకపోయామని అంజూరు చెప్పారు. ఆలయాన్ని తిరిగి పూర్తి రాతి కట్టడంతో అద్భుతంగా నిర్మించే విధంగా డిజైన్ చేయించడం జరిగిందనీ, పనులను త్వరగా చేపట్టి వచ్చే వైకుంఠ ఏకాదశి నాటికి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు కొండూరు సునీత, రమప్రభ, లక్ష్మి, పసల సుమతి ప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి, ఆలయ ఏఈఓ లోకేష్ రెడ్డి, సబ్ టెంపుల్స్ ఇన్‌చార్జ్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు : మండలంలోని రాజువారిపల్లి అంగన్వాడి కార్యకర్త పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు చిన్నగొట్టిగల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రాజమ్మ తెలిపారు. ఈపోస్టు ఎస్సీ కులానికి రిజర్వు చేయబడింది. దరఖాస్తు చేయదలిచిన వారు స్థానికులై ఉండాలన్నారు. పదవ తరగతి పాసై, 01-07-2022వతేదీ నాటికి 21 సంవత్సరాల నిండి 35 సంవత్సరాలు మించరాదన్నారు.దరఖాస్తులు జనవరి 7వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా చిన్నగొట్టిగల్లులోని తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఐదు గంటల తర్వాత ఇచ్చే దరఖాస్తులు స్వీకరించబడవని, మరిన్ని వివరాల కోసం పనివేళల్లో సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

బిఎన్‌కండ్రిగ: మండలంలోని అంగన్వాడీ టీచర్లు ఆయాలు ఖాళీగా ఉన్న సెంటర్లలో అర్హత ఉన్న అభ్యర్థులు అప్లై చేసుకోవాలని తొట్టంబేడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఫర్జానా ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తులు చేసుకోదగిన వారు జనవరి ఏడవ తేదీ సాయంకాలం ఐదు గంటలలోగా తొట్టంబేడు ఐసిడిఎస్ కార్యాలయం లో తమ దరఖాస్తులను సమర్పించాలని ఐదు గంటల పైబడి వచ్చిన దరఖాస్తులను స్వీకరించబడమని ఆమె తెలియజేశారు. ఇంకా ఏదైనా సమాచారం కావాలంటే కార్యాలయానికి వచ్చి తెలుసుకోవచ్చునని ఆమె తెలియజేశారు.

వైసిపి ప్రభుత్వం కన్నా బ్రిటిష్ వారే నయం

హక్కుల కోసం నిరాహార దీక్ష చేయనివ్వరా?- జోగయ్య నిర్బంధంపై కాపు నేతల ఆగ్రహం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎన్నో ఏళ్ళుగా ఆర్థికంగా వెనుకబడిన కాపు, బలిజ, ఒంటరి, తెలగల కులాలకు చెందిన ప్రజలకు ఐదు శాతం రిజర్వేషన్ సాధన కోసం 80 ఏళ్ల వయసులో కూడా కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షులు హరిరామ జోగయ్య నిరాహార దీక్షకు కూర్చున్నారని కాపు సంక్షేమ శాఖ నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, బద్దెను మధుబాబు తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డిసెంబర్ 31లోగా కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షులు హరిరామ జోగయ్య రాష్ట్ర ప్రభుత్వానికి తన లేఖ ద్వారా తెలిపారన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే నిరాహార దీక్షకు కూర్చున్నారని, 80 ఏళ్ల వయసున్న వ్యక్తిని అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేసి రోడ్లపై తిప్పుతూ కాపులపట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న కుటిల బుద్ధిని ప్రదర్శించారని, జోగయ్యకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే వైసీపీ ప్రభుత్వం కన్నా బ్రిటిష్ వారే నయమని అనిపిస్తోందన్నారు. రాష్ట్రంలోని కాపుల ఐక్యతతో రానున్న ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపడం ఖాయమని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన నాయకులు కరుణానిధి, రాజారాయల్, హిమవంత్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబసభ్యులతో డాక్టర్ హరిప్రసాద్

సంతాన సంపద వేంకటేశ్వరుని ఆలయంలో..

డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలోని ఏర్పేడు మండలం వికృతమాల గ్రామంలో ఉన్న శ్రీ సంతాన సంపద వేంకటేశ్వర స్వామి ఆలయానికి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతికరమైన పుష్యమాస ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకుంటే సకల దోషాలు తొలగి శుభాలు చేకూరుతాయని భక్తుల విశ్వాసమన్నారు. శ్రీ సంతాన సంపద వెంకటేశ్వర స్వామి ఆలయంలో శోభాయమానంగా పుష్పాలంకరణ చేశామని, ఉత్తర వైకుంఠ ద్వార దర్శనం చేసు కోవడానికి పెద్ద ఎత్తున భక్తులు, తిరుపతి చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు వచ్చి దర్శనం చేసుకోవడం జరిగిందన్నారు. భక్తులకు ఎక్కడ ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను చేశామన్నారు. అన్నప్రసాదాలను వితరణ చేశామన్నారు.

రేపు లూయి బ్రెయిల్ 214వ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జనవరి 4న తిరుపతి నగర పరిధిలోని బాలాజీ కాలనీ వద్దనున్న ఏపీ ఎన్జీవోస్ హోమ్‌లో అంధులకు లిపి ప్రదాత అయిన లూయి బ్రెయిల్ 214వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఇండియా చిత్తూరు జిల్లా సబ్ బ్రాంచ్ కోఆర్డినేటర్ డి.విజయ శేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో కార్యచరణతో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి, జాయింట్ కలెక్టర్ బాలాజీ, తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్, నవజీవన్ రిలీఫ్ సెంటర్ అధ్యక్షులు శ్రీధర్ ఆచారి మొదలైన వారు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే ప్రతి అల్లుడికి ఓ బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. నటరాజన్, కార్యవర్గ సభ్యులు మురగదేవి, సుధాకర్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ ద్వారకానాథ్ రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి- కెవిబిపురం: కేవిబిపురం మండలం తహశీల్దార్ ద్వారకానాథ్ రెడ్డిను రెవెన్యూ వీఆర్వోలు, క్షేత్ర సహాయకులు సోమవారం ఘనంగా సన్మానించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. తహశీల్దార్ ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయకుండా రెవెన్యూ పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి మునిరత్నం, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు మునిగోపాల్, ఈశ్వరయ్య, మునిభాస్కర్, దేవరాజులు రఘు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో విద్యుత్ ఏర్పాటు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పుత్తూరు మున్సిపాలిటీ శ్మశానవాటికల్లో అభివృద్ధి కోసం రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా కృషితో రూ.35 లక్షలతో పనులు చేపడుతున్నారు. సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి మాట్లాడుతూ జెసిపి సహకారంతో రోడ్డు నిర్మాణంలో అడ్డంగా ఉన్న విద్యుత్ పోలను తొలగించి రోడ్డు నిర్మాణం చేసి చెట్లను నాటుతామని అన్నారు. అదేవిధంగా మృతుల కుటుంబ సభ్యులకు స్నానాల గది నిర్మించి నీటి సౌకర్యం, పట్టణ ప్రజలకు మృతదేహాలను కమింగ్ చేసేందుకు రూములు ఏర్పాటు చేసి ప్రజలకు మంచి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ద్రౌపతి దేవి ధర్మరాజులు ఆలయ చైర్మన్ లారీ మోహన్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

మునిరాజశ్రీ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని సాంబయ్య పాళెంకు చెందిన టీడీపీ యువ నాయకురాలు మునిరాజశ్రీ రెడ్డి (చిట్టెమ్మ) జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చిట్టెమ్మ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మునిరాజశ్రీరెడ్డి తన జన్మదినం పురస్కరించుకుని జింగిలిపాళెం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఇక శ్రీకాళహస్తిలో ఫుట్‌పాత్ మీద ఉన్న వారికి దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిట్టెమ్మ అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల్లేని పంచాయతీగా తీర్మానం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని తీర్మాణం చేశామని మంగళం పరిధిలోని తిరుమలనగర్ గ్రామ పంచాయతీ వైసీపీ ఇన్‌చార్జి గుండ్రాజు శివశంకర్‌రాజు తెలిపారు. సోమవారం గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహించామని, సర్పంచ్ వకుళకు కోళ్ళఫారంలో సీసీ రోడ్డు నిర్మాణానికి, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ప్రజలు వినతులు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తలకోన వాటర్ ఫాల్స్‌లో..

యువకుడి మృతదేహం లభ్యం



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: తలకోన వాటర్ ఫాల్స్‌లో యువకులు స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతైన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు తిరుపతిలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న వెంకట మోహన్ (20) అనే విద్యార్థి నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం తోటి విద్యార్థులతో కలిసి తలకోనకు విచ్చేశారు. అందులో భాగంగా తలకోన జలపాతానికి వెళ్లి స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి గల్లంతై మృతి చెందారు. గల్లంతైన విద్యార్థి మృతదేహాన్ని సోమవారం పోలీసుల సాయంతో బయటికి తీశారు. మృతి చెందిన వెంకట మోహన్ గురించి తన తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకొని మృతుని తల్లిదండ్రులు మృతి చెందిన కన్న కొడుకును చూసి కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ప్రజాశక్తి - వరదయ్యపాలెం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాలు మేరకు వరదయ్య పాలెం మండలం చిన్న పాండూరు సమీపంలోని తెలుగుగంగ ఉపకాలవలో పడి వెంకయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడా లేక ఇతర కారణలు తెలియాల్సి ఉంది. మృతుడు నెల్లూరు జిల్లా గొలగమూడి గ్రామానికి చెందిన వ్యక్తి. శ్రీసిటీలోని పరిశ్రమంలో వృత్తిరీత్యా ఇక్కడ నివాసం ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అతని భార్య సెక్యూరిటీ గార్డ్‌గా మారో పరిశ్రమలో పని చేస్తున్నట్లు సమాచారం. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

టైలర్ల సంఘం గౌరవ అధ్యక్షులు మృతి

ప్రజాశక్తి- పిచ్చాటూరు: మండలంలోని టైలర్ల సంఘం గౌరవ అధ్యక్షులు రాజాబాయ్(72) సోమవారం ఉదయం పరమపదించారు. మండలంలోని కీలపూడి గ్రామానికి చెందిన రాజాబాయ్ 1960 నుండి పిచ్చాటూరులో టైలర్ వృత్తితో జీవనం సాగిస్తున్నాడు. గత నెల ప్రారంభం వరకు ఆయన టైలర్ పని చేస్తూ అనారోగ్యంతో మంచం పట్టాడు. బంధువులు చికిత్స చేసినా ఫలితం లేక పోవడంతో సోమవారం ఉదయం 9.00 గంటలకు తుది శ్వాస విడిచారు. ఈయన గత 20 ఏళ్లుగా పిచ్చాటూరు మండలం టైలర్ల సంఘం గౌరవ అధ్యక్షులుగా కొనసాగడం విశేషం. రాజాభాయ్ మరణంతో తమ సంఘం పెద్ద దిక్కును కోల్పోయిందని సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజా బాయ్ భౌతిక కాయానికి వారు నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

అధికారం కోసం బాబు యత్నాలు

ఎమ్మెల్సీ పోతుల సునీత



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అధికార దాహంతో తన ప్రచారార్బాటాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దని ఎమ్మెల్సీ పోతుల సునీత టిడిపి అధ్యక్షులు చంద్రబాబుకు సూచించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇబ్బందికర, చిన్నపాటి ఇరుకైన ప్రదేశాల్లో రోడ్‌షోలను నిర్వహించడంతో అమాయక ప్రజల ప్రాణాలు పోతున్నాయని అన్నారు. చంద్రబాబుపై 303 సెక్షన్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తికి ముందుచూపు లేక అధికార దాహంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. బాబు పాలనపై ప్రజలు ఎంతగా విసుగు చెందారో అందరికి తెలుసునన్నారు. తన రాజకీయ స్వలాభాల కోసం మొన్న కందుకూరులో 8 మంది, నిన్న గుంటూరులో ముగ్గురు ప్రజల ప్రాణాలను బలి చేశాడన్నారు. రాష్ట్ర ప్రజలకు కులమతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు మళ్ళీ కోరుకుంటున్నారన్నారు.

యూటిఎఫ్ నూతన డైరీలు ఆవిష్కరణ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఉపాధ్యాయుల యుటిఎఫ్ నూతన క్యాలెండర్‌ను డైరీని సోమవారం సాయంత్రం పుత్తూరు మండల విద్యా శాఖాధికారి బి.తిరుమల రాజుని మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలియజేశారు. అనంతరం 2023 యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఎంఈఓ తిరుమలరాజు చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు.